క్లుప్తంగా

ఫ్లెక్సీ, పోస్టర్ ఫ్రీ సిటీగా జగ్గయ్యపేట

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ పరిశుభ్రత, సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో భాగంగా అన్ని అనధికార ఫ్లెక్సీ బోర్డులు, పోస్టర్ల తొలగింపునకు శ్రీకారం చుట్టామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 13 వ తేదీ లోపు మున్సిపల్ పరిధిలో ఉన్న అనధికార ఫ్లెక్సీ బోర్డులు, బ్యానర్లు, హోర్డింగ్‌లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. లేని పక్షంలో 14 వ తేదీ నుంచి మున్సిపల్ అధికారులు తొలగిస్తారని తెలిపారు. ఏ రాజకీయ పార్టీ వారైనా సరే ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తే 48 గంటల్లో వారికి వారే తొలగించాలని తెలిపారు.

చిన్నారుల సహకారం వెలకట్టలేనిది



బూదవాడ(జగ్గయ్యపేట): వరద బాధితులకు చిన్నారులు అందించిన సహకారం వెలకట్టలేనిదని ఎంఈవో చిట్టిబాబు అన్నారు. మండలంలోని బూదవాడ మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు సేకరించిన విరాళాలతో అందించిన బియ్యాన్ని మంగళవారం ఆయన బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు సేకరించిన రూ.34 వేలతో బియ్యం కొనుగోలు చేసి గ్రామంలోని 24 బాధిత కుటుంబాలకు అందించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శివరాం నాయక్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

కంచికచర్ల: అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఎస్‌ఐ బోనగిరి రాజు హెచ్చరించారు. మండలంలోని మోగులూరు గ్రామానికి చెందిన యోనా అనే వ్యక్తి అక్రమంగా 15 మద్యం సీసాలను తీసుకెళుతుండగా మంగళవారం పట్టుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన సామాజిక తనిఖీ గ్రామ సభలు

జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి, ధర్మవరప్పాడు తండా, బలుసుపాడు, అగ్రహారం గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌పీ పున్నమి నాయుడు మాట్లాడుతూ గత వారం రోజులుగా అన్ని గ్రామాలలో సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించామన్నారు. 2023–24కు సంబంధించిన ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలతో పాటు గ్రామంలో జరిగిన పనులను సభల్లో వివరించామన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు కృష్ణ, అప్పారావు, సత్యనారాయణ, చంద్రరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా పంచాయతీరాజ్ చట్టాల అవగాహనపై జరుగుతున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పంచాయతీరాజ్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో మాధవ శర్మ, ఆయా గ్రామాల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు



నందిగామ టౌన్: భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు ఎరువులు, పురుగు మందులు, మిశ్రమ ఎరువులను వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మోనిషా అన్నారు. మండలంలోని ఐతవరం, కంచల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామాలలోని వరి, పత్తి, మిర్చి తదితర పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించటం వల్ల భూమిలోని పోషక లోపాలను గుర్తించి అవసరమైన ఎరువులను వాడే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే సాంకేతిక సలహాలు, సూచనలను రైతులకు అందించేందుకే పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రైతు తాము సాగు చేస్తున్న పంటలకు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సచివాలయాలు నిర్వీర్యం

సేవలు శూన్యం

- ఖాళీగా దర్శనమిస్తున్న గ్రామ సచివాలయాలు
- కొత్త పింఛన్, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- తెరుచుకోని వెబ్‌సైట్‌లు... పట్టించుకోని ప్రభుత్వం



కంచికచర్ల గ్రామ సచివాలయం

కంచికచర్ల: మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేసి నెరవేర్చింది. గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు 545 రకాల సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల్లో సేవలు నిర్వీర్యమయ్యాయి. ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రభుత్వ వెబ్ సైట్ తెరుచుకోలేదు. కొత్త పింఛన్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు అందకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు సచివాలయ ఉద్యోగులకు పనులు లేక ఖాళీగా ఉంటున్నారు. మండలాల్లో రెండు వేలు ఉన్న జనాభా ఉన్న గ్రామాల్లో రూ.40 లక్షలు వ్యయం ఖర్చుచేసి నూతన సచివాలయాలు నిర్మించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేయటంతో లబ్ధిదారులతో సచివాలయాల్లో సందడి కనిపించేది.

నియోజకవర్గంలో 68 గ్రామ సచివాలయాలు

నియోజకవర్గంలో కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో 68 గ్రామ సచివాలయాలు ఉండగా 800 మంది ఉద్యోగులకు పైగా విధులు నిర్వర్తిస్తున్నారు. కంచికచర్ల మండలంలో 17 గ్రామ సచివాలయాలు, నందిగామ మండలంలో 22 సచివాలయాలు, వీరులపాడు మండలంలో 15 గ్రామ సచివాలయాలు, చందర్లపాడు మండలంలో 14 గ్రామ సచివాలయాలు ఉన్నాయి.

నాడు అవహేళన చేశారు... నేడు వారితోనే పింఛన్లు పంపిణీ

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు సచివాలయ వ్యవస్థపై అడ్డగోలుగా విమర్శలు చేశారు. సచివాలయాలు ఎందుకు.. అవి అసలు ఉద్యోగాలే కాదంటూ అవహేళన చేశారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ ఉద్యోగులతో ఒకటో తేదీనే 95శాతం పైగా పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెప్పటం వెనుక సచివాలయాల ఉద్యోగుల పాత్ర కీలకమనేది జగమెరిగిన సత్యం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వంద రోజులు పాలన పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పేరిట గ్రామాల్లో వారం రోజుల పాటు సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికీ స్టిక్కర్లు అతికించే పని అప్పగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది.

వెలవెలబోతున్న సచివాలయాలు

ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రభుత్వ శాఖలపై క్షేత్ర స్థాయిలో ప్రగీజల స్థితిగతులపై అవగాహన కలిగి సచివాలయ ఉద్యోగులను ఎలా వినియోగించుకోవాలనే ప్రభుత్వానికి అవగాహన లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క కొత్త పింఛన్, రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ చేయకపోవటంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఎలాంటి సేవలు అందకపోవటంతో అవి వెలవెలబోతున్నాయి.

లక్ ఉంటేనే కిక్...

- మద్యం షాపులపై అదృష్టాన్ని పరీక్షించుకోనున్న ఆశావహులు
- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు



మద్యం సీసాలు

పెనుగంచిప్రోలు: మద్యం దుకాణాల కేటాయింపులో అదృష్టాన్ని పరీక్షించుకోవటానికి సిండికేట్‌లు, ఆశావహులు సిద్ధం అవుతున్నారు. మద్యం దుకాణాలను ప్రభుత్వ నియంత్రణలో నుంచి ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి విదితమే. గత ప్రభుత్వం దుకాణాల సంఖ్యను తగ్గిస్తూ విచ్చలవిడి అమ్మకాలపైనా నియంత్రణ చేసింది.

నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈనెల 12 న ప్రభుత్వం నుంచి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి దుకాణాలు మారనున్నాయి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో జగ్గయ్యపేట ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో పట్టణంలో నాలుగు, రూరల్‌లో నాలుగు, వత్సవాయి మండలంలో 2 దుకాణాల చొప్పున మొత్తం 10 మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. నందిగామ ఎక్సైజ్ శాఖ పరిధిలో పెనుగంచిప్రోలు మండలంలో 5, నందిగామ టౌన్, రూరల్ కలిపి 8, చందర్లపాడు మండలానికి 3 దుకాణాలకు అనుమతులు ఇచ్చారు.

లైసెన్స్ ఫీజులో మతలబు...

జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజు రూ.55 లక్షలు, రూ.65 లక్షలుగా నిర్ణయించారు. అయితే ప్రభుత్వం జనాభాను గ్రామ ప్రాతిపదికగా తీసుకోకుండా మండల ప్రాతిపదికగా తీసుకోవటంతో గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలకు సైతం రూ.65 లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లాటరీలో లక్ చెక్ చేసుకోవాలి అంటే రూ.2 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించాలి. ఈ నగదు నాన్ రిఫండబుల్ కావటంతో కొంతమందిలో సంశయం నెలకొన్నా సిండికేట్లు మాత్రం ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు.

రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో...

జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలు తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు కూడా అత్యధికంగా మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నట్లు చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం వరకు జగ్గయ్యపేట ఎక్సైజ్ శాఖ పరిధిలో మొత్తం 10 దుకాణాలకు గాను 275 దరఖాస్తులు, నందిగామ ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో 16 దుకాణాలకు గాను 350 దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. బుధవారం చివరి రోజు కావటంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరగనుంది. ముఖ్యంగా పెనుగంచిప్రోలు మండలానికి 5 దుకాణాలు కేటాయించగా అత్యధికంగా 200కు పైగా దరఖాస్తులు పడి ఉంటాయని అంటున్నారు. నిత్య యాత్రాస్థలం కావటంతో పాటు తెలంగాణ పక్కన ఉండటంతో అత్యధిక దరఖాస్తులు వేశారని అంటున్నారు.

అమృత స్వరూపిణీ..మహాలక్ష్మీ

మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



మహాలక్ష్మీ అలంకారంలో దర్శనమిస్తున్న నందిగామలోని మరిడీ మహాలక్ష్మీ అమ్మవారు



నందిగామ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గజలక్ష్మీ దేవిగా ...



మహాలక్ష్మీ అలంకారంలో అంబారుపేట సత్యమ్మ అమ్మవారు



పెనుగంచిప్రోలులో శ్రీమహాలక్ష్మీ దేవి అలంకరణలో అమ్మవారు



జగ్గయ్యపేటలోని మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో...



కంచికచర్ల వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా...



వత్సవాయి తూర్పుబజార్‌లోని విగ్రహం వద్ద ఎమ్మెల్యే రాజగోపాల్



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో అమ్మవారికి కుంకుమపూజ



పరిటాలలో దుర్గాదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



పరిటాలలో రూ.2.50 లక్షల కరెన్సీనోట్లతో అమ్మవారికి అలంకారం

నందిగామ టౌన్: దసరా మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని అంబారుపేట గ్రామంలో సత్యమ్మ అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో హరిగోపీనాథ్ పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు, చండీ సహిత రుద్రహోమం, ఖడ్గమాలార్చన తదితర పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలో కనకదుర్గ, కనక మహాలక్ష్మీ, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లను ఆలయ అర్చకులు శ్రీ మహాలక్ష్మీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయాలలోని పార్వతీ మాతకు ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శుక శ్యామలాంబ అమ్మవారు గజలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ, మరిడీ మహాలక్ష్మీ అమ్మవారు, మండలంలోని లింగాలపాడులో లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు.

చందర్లపాడులో...

మండలంలోని ఏటూరు గ్రామంలో సీతాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆయా గ్రామాలలోని అమ్మవార్లను ఆలయ అర్చకులు లలితా త్రిపుర సుందరీ దేవి, అన్నపూర్ణా దేవి, చండీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. రాత్రికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలాటలాడారు.

వత్సవాయిలో...

వత్సవాయి : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవరోజైన మంగళవారం మహాలక్ష్మీగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను కరెన్సీ నోట్లతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని పూజాక్రతువులు జరిపించారు. వత్సవాయి తూర్పు బజార్‌లో అమ్మవారి వద్ద ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బతుకమ్మలను ఒకచోట పేర్చి ఆడి పాడారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం తూర్పు బజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు కరెన్సీ నోట్ల అలంకరణలో శ్రీమహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితులు సూర్య నమస్కారాలు నిర్వహించారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగ్గయ్యపేట రూరల్‌లో...

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గ్రామాలలో ఏర్పాటు చేసిన శ్రీదేవీ నవరాత్రి మంటపాలలో దుర్గాదేవి మంగళవారం మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గౌరవరం, ముక్త్యాల, జయంతిపురం, వేదాద్రి, అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట గ్రామాలలోని దేవీ మంటపాలలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలోని ఈశ్వరీ అమ్మవారిని మహాలక్ష్మీగా అలంకరించారు.

వీరులపాడులో...

వీరులపాడు: మండలంలోని అల్లూరులో సీతారామచంద్ర సహిత మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారు మంగళవారం మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అల్లూరి భాస్కరరావు, అంజనీదేవి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వెల్లంకిలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో కనకదుర్గాదేవి అమ్మవారికి ఆరవ రోజు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శివసాయిక్షేత్రంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మంగళగౌరీదేవిగా అమ్మవారిని అలంకరించారు. వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో కనకదుర్గాదేవి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

పరిటాలలో...

మండలంలోని పరిటాలలో మహాలక్ష్మీ అమ్మవారుగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తూరు సెంటర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారికి భక్తులు రూ.200, రూ.500 కరెన్సీ నోట్లు మొత్తం రూ.2.50 లక్షల నగదుతో అలంకరించారు. అనంతరం గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.



ముక్త్యాలలో మహాలక్ష్మీ దేవి అలంకారంలో...



జగ్గయ్యపేటలో మహాలక్ష్మీ అలంకారంలో ఈశ్వరీ మాత



అల్లూరులో మహాలక్ష్మీ దేవి అలంకారంలో...



జగ్గయ్యపేటలో మార్కండేయబజారులోని మండపంలో శ్రీమహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు

అమ్మల గన్న అమ్మ..కనకదుర్గమ్మ...పాహిమాం

జగ్గయ్యపేట అర్బన్ : అమ్మల గన్న అమ్మ.. కనకదుర్గమ్మ...పాహిమాం అంటూ భక్తులు దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని వేడుకున్నారు. పట్టణంలోని పలు ఆలయాలలో మంగళవారం ఆరవ రోజు శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీచండీ మూలమంత్ర సహిత రుద్ర హోమం, కుంకుమార్చన, సాయంత్రం బాల పూజ నిర్వహించారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో ఆలయ కమిటీ వారు నిర్వహించిన కనకాభిషేకంలో కమిటీ చైర్మన్ దంపతులు అత్తులూరి వెంకటేశ్వర్లు, పుష్పావతి పాల్గొన్నారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, అద్దాల బజారులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీమహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వగా, చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, చండీ మూలమంత్ర సహిత రుద్రహోమం నిర్వహించారు. శ్రీధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. మార్కండేయబజారులోని మండపంలో బేతు సాయికృష్ణ ఆధ్వర్యంలో పూజలు జరగ్గా, ఆనందసాయి ఆలయంలో, తోటబజారులో ఏర్పాటుచేసిన మండపాల్లో అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.

వైభవంగా బతుకమ్మ సంబరాలు



పెనుగంచిప్రోలులో బతుకమ్మ వేడుక



అనిగండ్లపాడులో...

పెనుగంచిప్రోలు: మండలంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. సంప్రదాయాలను గౌరవిస్తూ బతుకమ్మ సంబరాల్లో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలను రంగురంగుల పూలతో, ఆకులతో తయారు చేసి గ్రామంలో ఆట, పాటల మధ్య మునేరులో నిమజ్జనం చేశారు. మంగళవారం రాత్రి పెనుగంచిప్రోలు శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, లింగగూడెం, ముండ్లపాడు, ముచ్చింతాల, అనిగండ్లపాడు గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

గ్రామంలో తాగునీటి పునరుద్ధరణ



పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులో మంగళవారం తాగునీటి పునరుద్ధరణ జరిగింది. గత నెలలో వచ్చిన మునేరు వరదలకు సుమారు 300 మీటర్ల మేర పైపులైన్ కొట్టుకుపోయింది. మునేరులో నీరు తగ్గక పోవటంతో పైపులైన్ మరమ్మతు పనులు చేయటానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో గత 35 రోజులుగా సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో గ్రామంలో నిరంతరాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. మరమ్మతు పనులను నిరంతరం సర్పంచ్ పర్యవేక్షించారు. చివరి రోజు పనులను స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శ్యామ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కాకాని శ్రీనివాసరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేడు శ్రీ గురుధాం ధర్మక్షేత్రానికి ఎమ్మెల్యే పాదయాత్ర

జగ్గయ్యపేట అర్బన్: ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, అమ్మాజీ దంపతులు బుధవారం ఉదయం 6 గంటలకు పట్టణంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం నుంచి మండలంలోని బలుసుపాడులో ఉన్న శ్రీ గురుధాం ధర్మక్షేత్రం వరకు సామూహిక పాదయాత్ర నిర్వహించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.